సాక్షి మెదక్

గురువారం । 3 । ఆగస్టు । 2023



108 సేవలు.. మరింత వేగం 8లో

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కృపితో సిద్దిపేట జిల్లాకు అత్యాధునిక టెక్నాలజీతో పాటు రోగికి తక్షణ వైద్య సదుపాయాలు అందించే 15 నూతన వాహనాలు కేటాయించారు.



ఆశ చూపి దోచేస్తున్నారు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం. ఉద్యోగాలు. ప్రకటనల పేరుతో వివిధ రకాలుగా ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకుంటున్నారు. 8లో



అధ్వానంగా పాలిటెక్నిక్ హాస్టల్

చుట్టూ పిచ్చిమొక్కలు... మురుగునీరు అడుగు తీసి అడుగు వేయాలంటే ఎక్కడ ఏ పాము, తేళ్లు ఉన్నాయో తెలియని భయం.. ఇదీ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ వసతి గృహం. 9లో

న్యూస్‌రీల్

విద్యా వికాసానికే తొలిమెట్టు



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి (తూప్రాన్): గతేడాది తొలిమెట్టు కార్యక్రమం సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ ఏడాది కూడా చేపడుతున్నట్లు డీఈఓ రాధాకిషన్ పేర్కొన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమంపై ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 21 మండలాల్లో శిక్షణ తరగతులు ప్రారంభించామన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులపై ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో కనీస భాష సామర్థ్యాల సాధనకు ఉపాధ్యాయులు బోధించాలని కోరారు. దీంతో విద్యార్థుల్లో అవగాహన పెరిగి సామర్థ్యాలు మెరుగు పడతాయని చెప్పారు. శిక్షణ శిబిరంలో అందుకున్న మెలకువలను పాఠశాల స్థాయిలో ప్రతి ఒక్కరూ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి మత్స్యకారుల సమస్యలు



కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్: రాష్ట్రంలో మత్స్యకారుల సమస్యలను కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తం రూపాల దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ చెప్పారు. బుధవారం ఉదయం మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్‌తో కలసి మత్స్యకారుల సమస్యలను వివరించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మత్స్యకారులకు అందచేస్తున్న చేప పిల్లల్లో నాణ్యత లేదని మంత్రికి వివరించామని తెలిపారు. చేప పిల్లల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందచేస్తున్నా.. పూర్తి నిధులు రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. చెరువులలో చేపలు పట్టేందుకు సరైన సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

మెదక్: ఈ నెల 4వ తేదీ నుంచి వైన్స్‌ల నిర్వహణ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 49 వైన్స్‌లను కేటాయించగా.. ఇందులో 9 గౌడ కులస్తులకు, 6 ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు, 33 జనరల్‌కు కేటాయించినట్లు వివరించారు. ముందుగా రిజర్వేషన్ వైన్స్‌లను కలెక్టర్ సమక్షంలో కేటాయింపులు జరుగుతాయని పేర్కొన్నారు. 4 నుంచి 18వ తేదీ వరకు వైన్స్‌ల నిర్వహణ కోసం దరఖాస్తులు తీసుకుని 21న కలెక్టరేట్లో డ్రా పద్ధతిన షాపులను ఎంపిక చేస్తామన్నారు. అదనపు సమాచారం కోసం 9440902738 ఫోన్ చేయాలని ఆయన కోరారు.

అదనపు ఎస్పీగా బాధ్యతల స్వీకరణ



ఎస్పీ రోహిణిని కలిసిన ఏఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: అదనపు ఎస్పీగా ఎస్.మహేందర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రోహిణి ప్రియదర్శినిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. సిద్దిపేట జిల్లా అదనపు డీసీపీ అడ్మిన్, లా అండ్ ఆర్డర్‌గా పనిచేసిన మహేందర్.. ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ సారథ్యంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో అందరూ సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు సాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పాంబండ గ్రామంలో ఇండ్లు కూలిన బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా నిత్యావసర సరుకులు అందజేశారు. పాంబండ గ్రామంలో 4 ఇండ్లు కూలిపోవడంతో వారికి నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు.

నాటుతున్నారు.. నరుకుతున్నారు!

అభాసుపాలవుతున్న హరితహారం

- అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం
- రోడ్ల వెంట విద్యుత్ తీగల కింద పెంపకం
- ఏటా వేలాది చెట్లు నేలమట్టం

మెదక్: అధికారుల తప్పిదాలతో హరితహారం అభాసుపాలవుతోంది. రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో అవి కాస్త పెరగగానే నరికివేస్తున్నారు. జిల్లాలోని అనేక మండలాల్లో ఇప్పటికీ ఇదే తీరు కొనసాగుతుంది. జిల్లావ్యాప్తంగా 469 నర్సరీలను ఏర్పాటు చేసి విరివిగా మొక్కలు పెంచి నాటుతున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. మొక్కలకు ఎలాంటి ఇబ్బందులు లేని స్థలాల్లో నాటాల్సి ఉండగా రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద నాటడంతో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. నాటిన మొక్కలు కాస్త పెరగగానే నరికేస్తున్నారు. నరికేసిన చోట మళ్లీ కొత్తవి నాటుతున్నారు. అయితే మొక్కలను అధికారులు లెక్కల కోసం నాటుతున్నారా..? లేక సంరక్షణ కోసమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి నర్సరీల్లో మొక్కలు పెంచి వాటిని రెండు, మూడు నెలల పాటు సంరక్షించి ఈజీఎస్ కూలీలతో నాటిస్తున్నారు.

టార్గెట్ 34 లక్షల మొక్కలు..

ఈ ఏడాది హరితహారంలో భాగంగా జిల్లాలోని నాలుగు మున్సిపల్ శాఖలతో పాటు డీఆర్‌డీఏ, అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్, ఎక్సైజ్, మైనింగ్, అంగన్‌వాడీ, విద్యాశాఖ, ట్రాన్స్‌కో తదితర శాఖల పరిధిలో 34 లక్షల మొక్కలు నాటాలని టార్గెట్ విధించారు. అయితే ఇప్పటికే 24 లక్షల మొక్కలు నాటారు. వర్షాలు జూలైలో కురవడంతో ఆలస్యం అయిందని అధికారులు చెబుతున్నారు. మరో 10 లక్షలను ఈ వారంలో నాటుతామని అటవీ అధికారులు చెబుతున్నారు.



చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామ శివారులో విద్యుత్ తీగల కింద చెట్లు

ప్రాణ..ఆస్తి నష్టం

రోడ్ల వెంట, విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడుతున్నాయి. దీంతో స్తంభాలు విరిగిపోవడంతో పాటు విద్యుత్ తీగలకు తాకి పలువురు మృత్యువాత పడుతున్నారు. మేత కోసం వెళ్లిన పశువులు సైతం వాటికి తాకి దుర్మరణం చెందుతున్నాయి. ప్రాణ నష్టంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాన్స్‌కోకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ వర్షాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 149 విద్యుత్ స్తంభాలు విరిగి రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో ఎక్కువ నష్టం వచ్చినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కొన్ని మండలాల్లో ఇలా..

మెదక్- రామాయంపేట ప్రధాన రహదారి రామాయంపేట పోలీస్‌స్టేషన్ నుంచి మొదలుకుని హైవే బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగలు ఉన్నాయి. అయితే ఇటీవల మొక్కలను వాటి కిందనే నాటారు. అవి పెరిగాక తీగలకు తాకితే నరికేయాల్సిన పరిస్థితి నెలకొంది. పాపన్నపేట మండలం ఏడుపాయల ప్రధాన రహదారి నాగ్సాన్‌పల్లి కమాన్ నుంచి మొదలుకుని ఏడుపాయల దేవస్థానం వరకు 4 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగలు పైన ఉంటే కిందనే మొక్కలు నాటారు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి- జంగరాయి ప్రధాన రహదారి వెంట రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఒకసారి నరికేశారు. అయినా మరోసారి మొక్కలు నాటారు. ఇదేమండలం శంకరంపేట మండల కేంద్రం నుంచి కామారం వెళ్లే రహదారికి ఇరుపైపులా విద్యుత్ తీగల కింద మొక్కలు నాటారు. శంకరంపేట- మీర్జాపల్లి ప్రధాన రహదారిపై సైతం ఇలాగే నాటారు. చేగుంట పట్టణంలోని మెదక్, రామాయంపేట, మక్కరాజిపేట రోడ్లుకు ఇరువైపులా విద్యుత్ తీగల కిందనే మొక్కలు నాటారు. ప్రస్తుతం తీగలకు తగిలే దశలో ప్రమాదకరంగా ఉన్నాయి. ఇలా అనేక మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



చేగుంట మండల కేంద్రంలో ..

ముర్రుపాలు శ్రేష్ఠం: కలెక్టర్



తల్లిపాల ప్రాముఖ్యత పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఇంట్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో తల్లిపాల వారోత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, దీంతో చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈనెల 7వ తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మెప్మా, మహిళ స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మహిళా శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ, ఏఓ నవీన, ఇతర అధికారులు రామ్మోహన్, శ్రీనివాస్, పోషన్ అభియాన్ పాల్గొన్నారు.

అన్ని కులసంఘాలకు భవనాలు

- ఎమ్మెల్యే మదన్‌రెడ్డి
- 102 అంబులెన్స్‌లు ప్రారంభం



ప్రభుత్వ భూమి మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్‌లో అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పలువురు నాయకులు, అధికారులతో కలిసి పట్టణ శివారులోని 731 సర్వే నంబర్‌లోని భూమిని, అందుకు సంబంధించిన రికార్డులు, మ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సర్వే నంబర్‌లో 35 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. అందులో డంప్‌యార్డుకు ఐదెకరాలు, ముస్లిం శ్మశాన వాటికకు ఐదెకరాలు, క్రైస్తవుల గ్రేవ్ యార్డుకు ఒక ఎకరం భూమి కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి ఏడెకరాలు, సబ్ స్టేషన్ నిర్మాణానికి ఒక ఎకరం భూమిని కేటాయిస్తామని, మిగిలిన భూమిలో పట్టణంలోని ఆయా కుల సంఘాల భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఎస్సీ భవన్‌కు రూ.60లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. కాగా ఆర్యవైశ్య సంఘానికి భూమి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శ్రీనివాస్‌గుప్తా, శ్రీధర్‌గుప్తా, వెంకన్న, పాండురంగం, మురళీ, వెంకటేష్, మాచర్ల శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానించారు. కాగా, నర్సాపూర్, కౌడిపల్లి మండలాలకు మంజూరైన 102 అంబులెన్స్‌లను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, అశోక్‌గౌడ్, శ్రీధర్‌గుప్తా, హబీబ్‌ఖాన్, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, నగేశ్, రాకేష్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

మెదక్‌పై హరీశ్ శీతకన్ను

- కార్యాలయాలను తరలిస్తుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్లు..?
- పీసీసీ అధికార ప్రతినిధి బాలకృష్ణ ప్రశ్న



మాట్లాడుతున్న బాలకృష్ణ

మెదక్: మంత్రి టి.హరీశ్‌రావు మెదక్ జిల్లాపై కక్ష గట్టారని పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అన్నారు. బుధవారం పార్టీ నేత సుప్రభాత్‌రావుతో కలసి విలేకరులతో మాట్లాడారు. మెదక్ జిల్లా నుంచి సిద్దిపేటకు ఒక్కో ప్రభుత్వ కార్యాలయాన్ని తరలించుకు పోతున్నారని చెప్పారు. ఇప్పటికే అటవీ కార్యాలయం, పట్టుపరిశ్రమ, మహిళా డిగ్రీ కళాశాలను, తాజాగా డ్రగ్స్ కంట్రోల్ ఏడీ కార్యాలయాన్ని తరలించుకుపోయారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి అడ్డుతగులుతున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే పద్మ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంత ప్రజలు ఈ అన్యాయాలను అడ్డుకోకపోతే మెదక్ జిల్లా ఎప్పటికి అభివృద్ధి చెందదని వారు పేర్కొన్నారు. మెదక్ నుంచి సిద్దిపేటకు తరలించిన కార్యాలయాలను వెంటనే వెనక్కి తెప్పించటంతో పాటు రామాయంపేటను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రిని అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

గుజిరితండా అభివృద్ధికి నిధులివ్వండి



ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న తండా వాసులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గుజిరితండా సర్పంచ్ రాకేశ్, తండావాసులతో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని, హైదరాబాద్‌లోని ఆయన క్వార్టర్స్‌లోనే కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ తండా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, అదేవిధంగా ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరామన్నారు. అనంతరం తండాకు చెందిన రమావత్ భాస్కర్‌కు రూ. 20 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో తండావాసులు ఆనంద్, వరాజ్యనాయక్, జీవులా, పన్నాలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించండి



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మెదక్ కలెక్టరేట్: పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం అచ్చంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో గతంలో 7వ తరగతి వరకు ఉండేదని, ప్రస్తుతం 5వ తరగతి వరకు మాత్రమే చెబుతున్నారన్నారు. ప్రస్తుతం 50 మంది విద్యార్థులు ఉండగా ఒకే ఒక్క టీచర్ ఉన్నారని చెప్పారు. ఆ టీచర్ కూడా సక్రమంగా పాఠశాలకు రావడంలేదన్నారు. ఈ విషయమై పలుమార్లు ఎంఈఓ, డీఈఓలకు ఫిర్యాదులు చేసినా స్పందించలేదన్నారు. చేసేదిలేక డీఈఓ కార్యాలయం వరకు వచ్చి నిరసన చేపట్టాల్సి వచ్చిందని వాపోయారు. అనంతరం డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ లక్ష్మీకాంతంరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

గొల్లకురుమలకు ఆర్థిక స్వావలంబన

- మెదక్ ఎమ్మెల్యే పద్మ
- వాడిలో రెండో విడత గొర్రెల పంపిణీ



జావెలిన్‌ను విసురుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

హవేళీఘనపూర్: గొల్లకురుమల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హవేళీఘనపూర్ మండల పరిధిలోని వాడి గ్రామంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మాంసం వినియోగానికి అనుగుణంగా గొర్రెలను పెంచాలని, అలాగే.. గొల్లకుర్మలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దీంతో ప్రజలకు మాంసంతో పాటు గొల్లకుర్మలకు ఉపాధి అవకాశాలు లభిస్తుందన్నారు.

గొర్రెలు అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు క్యాంపును ఏర్పాటు చేసి వాటి బాగోగులు చూసుకునేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి విడత వచ్చిన గొర్రెలకు మందులను పశువైద్యాధికారులు సరఫరా చేయడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. తగు చర్యలు తీసుకోవాలని పశువైద్యాధికారిని ఆదేశించారు. అనంతరం వాడి గ్రామ పంచాయతీ పరిధిలోని దూప్‌సింగ్ తండా వంతెనను పరిశీలించారు. ప్రస్తుతం నీటి ఉధృతి తక్కువగా ఉన్నందున తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యరెడ్డి, వైస్ ఎంపీపీ రాధాకిషన్‌యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు ఖాలేద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానివొద్దు

ఘణపురం ఆనకట్ట ఎంఎన్ కెనాల్ నుంచి వచ్చిన నీటితో సర్దన గ్రామంలో వెళ్లే కాల్వ ద్వారా ఎస్సీ కాలనీలోకి వచ్చే అవకాశం ఉందని, ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించాలని

అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

మెదక్: మెదక్ ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం అథ్లెటిక్స్ పోటీలను ఎమ్మెల్యే పద్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్ 14, 16, 18, 20 యువతీ, యువకులు పాల్గొన్నారు. జావెలిన్‌త్రోతో పాటు 100-400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో జావెలిన్ త్రోలో 10మంది, 100 మీటర్ల పరుగు పందెంలో 10 మంది 400 మీటర్ల పరుగు పందెంలో 10 మంది చొప్పున క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. వీరు ఆగస్టు 7న వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరమణ, మధుసూదన్ తెలిపారు. వివరాల కోసం.. 9963005540, 9704343222 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ డిపోలో సంబురాలు

మెదక్: ఆర్టీసీ కార్మికులకు ఉన్నతస్థానం కల్పించేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపోలో కార్మికులకు స్వీట్లు తినిపించి, వారితో సంబురాల్లో పాల్గొన్నారు. డీఎం సుధా, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు జయరాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవనం.. ప్రారంభమెప్పుడో?



చిట్కుల్ పల్లె దవాఖాన భవనం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రం చిలప్‌చెడ్, చిట్కుల్, ఫైజాబాద్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ.39లక్షలతో చేపట్టిన మూడు భవనాలు పూర్తయి రెండు నెలలైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నందున త్వరగా భవనాలను ప్రా రం భించి వైద్య సేవలను ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మంజీర.. జలధీర!

నిండుకుండలా డ్యామ్

ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో సంగారెడ్డి జిల్లా కలబ్‌గూరు లోని మంజీర డ్యామ్ నిండుకుండను తలపిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, పర్యాటకులు మంజీర అందాలను చూసేందుకు తరలివస్తున్నా రు. అభయారణ్యంలో సేద తీరుతున్నారు. డ్యామ్ పైకి వెళ్లేందుకు అనుమతి లేక పోవడంతో వచ్చిన జనం నిరాశ చెందుతున్నారు.

\- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

క్లుప్తంగా

ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



హవేళీఘనపూర్: ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని వారి వద్ద నుంచి బైక్, 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మెదక్ టాస్క్‌ఫోర్స్ సీఐ నరేందర్‌గౌడ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నెరెళ్లకు చెందిన దరావత్ జవహర్‌సింగ్, దరావత్ శ్రీనివాస్ బైక్‌పై 1.4 కిలోల గంజాయి తీసుకెళ్తుండగా ప ట్టు కొని వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు వివరించారు.

జీవితంపై విరక్తితో వృద్ధురాలి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): కడుపున పుట్టిన పిల్లలు సరిగా చూసుకోకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈసంఘటన మండల పరిధిలోని దొంతిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి పిట్ల స్వరూప (65) అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది. ఈమెకు కూతురు, కొడుకు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అయి స్థిరపడ్డారు. కొన్ని నెలలుగా వారు సక్రమంగా చూసుకోవడం లేదు. దీనికి తోడు స్వరూపకు అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయత్రం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులో ఉన్న మాసానికుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

తొగుట(దుబ్బాక): బైక్ అదుపుతప్పి కిందపడి ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందిన యాదగిరి బైక్‌పై గజ్వేల్ నుంచి చెప్యాలకు వెళ్తుండగా వెంకట్రావుపేట గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



మాట్లాడుతున్న ఎస్పీ రమణ కుమార్

సంగారెడ్డిటౌన్: జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎస్పీ రమణ కుమార్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీ య పార్టీల ప్రతినిధులు, అధికారులతో నిర్వహించి న సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నిక ల్లో ఏర్పాటు చేసినట్టుగానే ఈసారి కూడా పటిష్టమై న బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అవసరమైన చోట అదనపు బలగాలను ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,594 పోలింగ్ కేంద్రాలు ప్రతిపాదించామన్నారు. ఈసందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు అంశాలపై ఎస్పీ, అదనపు కలెక్టర్, డీఆర్‌ఓ అవగాహన కల్పిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అశోక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

108 సేవలు.. మరింత వేగం



సిద్దిపేటకు కేటాయించిన నూతన 108 వాహనాలతో సిబ్బంది



ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేట జిల్లాకు అత్యాధునిక టెక్నాలజీతో పాటు రోగికి తక్షణ వైద్య సదుపాయాలు అందించే పరికరాలతో కూడిన 15 నూతన వాహనాలు కేటాయించారు. 8- 108 వాహనాలు, 6- 102, అత్యవసర సేవలు అందించే వాహనం ఒకటి కేటాయించారు. దీంతో నూతన వాటితో కలిపి మొత్తం 29 వాహనాల ద్వారా జిల్లాలో మెరుగైన సేవలు అందనున్నాయి. అత్యవసర సమయంలో రోగికి సరైన వైద్యం అందించడంలో 108 కీలకంగా వ్యవహరిస్తున్నాయి. అలాగే గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఇంటి నుంచి ఆస్పత్రికి.. డెలివరీ అనంతరం బాలింతలను ఆస్పత్రి నుంచి ఇంటికి చేరవేయడానికి 102ను వినియోగిస్తున్నారు. – సిద్దిపేటకమాన్

- సిద్దిపేట జిల్లాకు 15 నూతన వాహనాల కేటాయింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది, ప్రజలు

మొత్తం 29 వాహనాలు

సిద్దిపేట జిల్లాకు 15 నూతన వాహనాలు కేటాయించారు. జిల్లాలో ప్రస్తుతం (16) 108 వాహనాల ద్వారా సేవలు అందిస్తున్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు, హుస్నాబాద్‌లో రెండు, గజ్వేల్‌లో రెండు, ములుగు 01, జగదేవ్‌పూర్ 01, దౌల్తాబాద్ 01, దుబ్బాక 01, భూంపల్లి చిట్టాపూర్ 01, చిన్నకోడూర్ 01, కొండపాక 01, చేర్యాల 01, నంగునూర్ 01, బెజ్జంకిలో ఒక వాహనం ద్వారా సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అయితే వీటిలో మరమ్మతుల స్థితిలో ఉన్న ఆరు వాహనాల స్థానంలో కొత్త వాటితో పాటు రెండు నూతన వాహనాలు కేటాయించారు. నూతన వాహనాలను గుర్రాలగొంది, కోహెడ ప్రాంతాలకు కేటాయించారు. అదేవిధంగా ఎనిమిది 102 (అమ్మ ఒడి) వాహనాలు ఉండగా వీటిలో మరమ్మతుల స్థితిలో ఉన్న ఆరు వాహనాల స్థానంలో కొత్తవి కేటాయించారు. 102 వాహనాలు సిద్దిపేటలో మూడు, గజ్వేల్‌లో రెండు, చేర్యాల 01, దుబ్బాక 01, హుస్నాబాద్ 01 వాహనాల ద్వారా గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్నాయి. వీటితో పాటు జిల్లాలో రెండు పాస్ట్ సర్వీస్ సేవలు అందించే వాహనాలు (పార్థివదేహాలు తరలించే వాహనం) రెండు ఉండగా ఇవి గజ్వేల్‌లో ఒకటి, సిద్దిపేటలో ఒకటి సేవలు అందిస్తున్నాయి. వీటికి మరో నూతన ఎఫ్‌హెచ్‌ఎస్ వాహనాన్ని సిద్దిపే టకు కేటాయించారు.

95 మంది సిబ్బంది

మొత్తం 29 వాహనాల ద్వారా జిల్లావ్యాప్తంగా సేవలు అందించనున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 95 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 41 మంది పైలెట్లు, 36 మంది ఈఎంటీ, 18 మంది ఇతర సిబ్బంది సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. మరో నలుగురు సిబ్బందిని నియామకం చేసుకోవాల్సి ఉందని వైద్యాధికారులు చెబుతున్నారు. కొత్త వాహనాల కేటాయింపుపై జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సేవలు

ప్రస్తుతం ఉన్న 108, 102 వాహనాలకు అదనంగా నూతన వాహనాలు కేటాయించారు. ప్రస్తుతం 29 వాహనాల ద్వారా జిల్లాలో సేవలు అందిస్తాం. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. జిల్లా ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



– కాశీనాథ్, డీఎంహెచ్‌ఓ, సిద్దిపేట

శివ్వంపేటలో దొంగల హల్‌చల్

- నగల దుకాణంలో చోరీ.. ఏటీఎంలో విఫలయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడడంతో పాటు దొంతిలోని ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేటలో తూప్రాన్– నర్సాపూర్ ప్రధాన రోడ్డు పక్కన రాజస్థాన్‌కు చెందిన సత్యనారాయణ దుకాణం అద్దెకు తీసుకుని బంగారు నగల దుకాణం, పాన్ బ్రోకర్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రోజువారీగానే మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లాడు. అర్ధరాత్రి గడ్డపారతో షట్టర్‌ను పైకి లేపి లోనికి ప్రవేశించిన దొంగలు 20 తులాల వెండి ఆభరణాలు, పలు రోల్డ్‌గోల్డ్ వస్తువులు, 3,500 నగదు దొంగిలించారు. గ్రహించిన చుట్టుపక్కల వారు లేచి వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా రాళ్లతో ఎదురుదాడి చేసి పరారయ్యారు. చోరీ ఘటన దుకాణంలోని సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఐదుగురు యువకులు ముఖానికి మాస్కులు ధరించి ఉన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. అలాగే మండలంలోని దొంతి గ్రామ పరిధిలో తూప్రాన్– నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన మూతపడి ఉన్న ఆంధ్రాబ్యాంకు ఏటీఎంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం లోనికి ప్రవేశించిన దొంగలు అందులో డబ్బులు లేవని గ్రహించి వెళ్లిపోయారు. ఘటనపై బ్యాంకు మేనేజర్ సూర్యం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏటీఎంను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపారు. తూప్రాన్ సీఐ శ్రీధర్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

ఉద్యోగం దొరకడం లేదని..

- మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఉపేందర్‌రెడ్డి(ఫైల్)



బావిలో నుంచి మృతదేహాన్ని తీస్తున్న దృశ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం దొరకడం లేదు.. తోటి స్నేహితులు ఉద్యోగం చేస్తున్నారని మనస్తాపం చెందిన యువకుడు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసంఘటన మండల పరిధిలోని వితలాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటలక్ష్మి, లక్ష్మారెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరు వ్యవసాయం చేస్తూ కుమారులను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కుమారుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, చిన్నకుమారుడు ఉపేందర్‌రెడ్డి (25) బీటెక్ పూర్తి చేశాడు. ఏడాదిగా ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడం.. తోటి స్నేహితులు ఉద్యోగం చేస్తున్నారని సన్నిహితులతో చెబుతూ ఉండేవాడు. ఈ క్రమంలో అదే గ్రామంలో ఉంటున్న తన మేనమామ తిరుపతిరెడ్డి వ్యవసాయ బావి వద్ద మోటారు మరమ్మతుల కోసం ఆయనతో కలిసి వెళ్లాడు. పని ముగించుకొని తిరుపతిరెడ్డి ఇంటికి రాగా.. ఉపేందర్‌రెడ్డి రాత్రి వరకు ఇంటికి రాలేదు. దీంతో రాత్రి తన మామ వాళ్ల ఇంట్లోనే ఉన్నాడని కుటుంబీకులు భావించారు. బుధవారం ఉదయం తిరుపతిరెడ్డి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా గట్టుపైన ఉపేందర్ సెల్‌ఫోన్, డ్రెస్ ఉండడంతో కుటుంబీకులకు సమాచారం అందించాడు. బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కొడుకు మృతితో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి..

- ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



సిరాజ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన ఎండీ. సిరాజ్ (32) బీరంగూడ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. మంగళవారం స్నేహితులు షబ్బీర్, నజీర్‌తో కలిసి అమీన్‌పూర్ పరిధిలోని జానకంపేట, వడక్‌పల్లిలో మద్యం సేవించాడు. అనంతరం వడక్‌పల్లి సమీపంలో గల నల్ల చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. స్నేహితుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరుటౌన్: సైబర్ వలలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పడి డబ్బులు పోగొట్టుకున్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ. 5 లక్షల 75 వేలు, మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. లక్షా 18 వేలు పోగొట్టుకున్నారు. ఈసంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 28వ తేదీన వాట్సాప్‌కు పార్ట్ టైం జాబ్ లింక్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలు నమోదు చేసింది. కొంత నగదు ఇన్వెస్ట్ చేస్తే టాస్క్‌లు ఇస్తామని.. పూర్తి చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇస్తామని ఆశ చూపారు. పలు దఫాలుగా రూ. ఐదు లక్షల 75 వేలు వేసింది. ఇంకా నగదు జమ చేయాలని అడగడంతో అనుమానం వచ్చిన ఉద్యోగి తాను ఇన్వెస్ట్ చేసిన నగదు వెనక్కి ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో మోసపోయినట్టు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే అమీన్‌పూర్ సిద్ధార్థ ఎన్‌క్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జూలై 30వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట మెసేజ్ వచ్చింది. స్పందించిన ఉద్యోగి తన వివరాలు నమోదు చేసి పలు దఫాలుగా రూ. లక్షా 18 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తీరా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందన రాలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇద్దరి ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ చూపి దోచేస్తున్నారు

- సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో రూ. 4 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



సిద్దిపేటకమాన్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, ఉద్యోగాలు, ప్రకటనల పేరుతో వివిధ రకాలుగా ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో డబ్బులు దోచుకుంటున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు వివిధ రకాలుగా ఆన్‌లైన్ మోసానికి గురై రూ.4,06,059 పోగొట్టుకున్నారు. సీపీ శ్వేత బుధవారం వివరాలు వెల్లడించారు.

లాభాలు వస్తాయని..

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రామ్ యాప్‌లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రకటన చూశాడు. అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా ఒక టాస్క్‌లో భాగంగా 35 ప్రొడక్ట్‌లలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని గుర్తు తెలియని వ్యక్తి తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో వారం రోజుల నుంచి పలు దఫాలుగా రూ. 3,23,028 పంపించాడు. తర్వాత ఆ లింకు ఓపెన్ చేయగా బ్లాక్ చేసి ఉండడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న మొత్తం డబ్బులను సీజ్ చేశారు.

లోన్ యాప్ పేరుతో..

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో అరోరా లోన్ యాప్ ద్వారా లోన్ తీసుకుని నెల రోజుల్లోపు మొత్తం డబ్బులు చెల్లించాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బాధితుడి ఫొటోలను న్యూడ్ ఫొటోలుగా ఎడిట్ చేసి వాట్సాప్‌కు పంపి వాటిని డిలిట్ చేయాలంటే డబ్బులు పంపాలని బెదిరించాడు. బాధితుడు రూ. 6,500 ఆన్‌లైన్‌లో పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయగా రూ. 6,500 ఫ్రీజ్ చేశారు.

ఆన్‌లైన్ ఆర్డర్ పేరుతో..

సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి రెండు ఎల్‌ఈడీ బోర్డుల కోసం ఆన్‌లైన్‌లో రూ. 25 వేలు చెల్లించి ఆర్డర్ చేశాడు. పది రోజుల తర్వాత కూడా వస్తువులు రాకపోవడంతో డబ్బులు పంపిన నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన రాలేదు. అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఉద్యోగం పేరిట

చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు ఉద్యోగం ఉందంటూ వచ్చిన మెసెజ్‌కు స్పందించి ఆ నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాత డబ్బులు చెల్లించాలని తెలపగా బాధితుడు ఆన్‌లైన్‌లో రూ. 3,100 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఫేస్‌బుక్‌లో ప్రకటన చూసి

చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో బైక్ అమ్మకానికి ఉందనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి పంపిన బైక్ ఫొటోలు చూసి ఆశపడి అతడు సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో రూ. 48,431 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ. 14,734 ఫ్రీజ్ చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

అటవీ కళాశాల సందర్శన



కళాశాలలో మ్యూజియంను తిలకిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్

ములుగు(గజ్వేల్): హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురామన్ బుధవారం సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్‌ఐ)ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కళాశాలలోని విద్య, పరిశోధన విస్తరణకు సంబంధించి ఫారెస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ రంగాలలో సంభావ్య సహకారం గురించి కళాశాల డీన్, సీఎం కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్, అధ్యాపకులతో చర్చించారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)లో చదవడానికి అవకాశాలు, ఫెలోషిపులు, స్కాలర్‌షిప్‌ల గురించి వారు విద్యార్థుల ఇంటరాక్షన్ సెషన్‌లో చర్చించారు. అనంతరం కళాశాలలోని ప్రయోగశాలలు, మ్యూజియంను సందర్శించారు. కళాశాల జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



మహిపాల్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహిపాల్ చికిత్స పొందుతూ మృతిచెందారు. సంగారెడ్డి పట్టణం బాబానగర్‌కు చెందిన మహిపాల్ సివిల్ కానిస్టేబుల్ 2002 బ్యాచ్‌కు చెందిన వ్యక్తి. పటాన్‌చెరు పట్టణం చైతన్య నగర్ కాలనీలో ఉంటూ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఇతని భార్య స్వరూప నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్‌లో హెడ్ కానిస్టేబుల్ ట్రైనింగ్ కు వెళ్లి, ట్రైనింగ్ పూర్తి చేసుకొని వచ్చిన మహిపాల్ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో గచ్చిబౌలి సమీపంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పట్టణ సీఐ లాలూ నాయక్, ఎస్‌ఐలు, సిబ్బంది కానిస్టేబుల్ మహిపాల్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కానిస్టేబుల్ మహిపాల్ మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి అదృశ్యం

వేర్వేరు చోట్ల ఐదుగురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు.. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో మహిళ అదృశ్యమైంది.

ఆస్పత్రికి వెళ్తున్నానని..

పటాన్‌చెరుటౌన్: ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామేశ్వరం బండ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన రమీజా బేగం కూతురు యాస్మిన్ బేగం (20) జూలై 31 తేదీన ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశ్యంపై బుధవారం తల్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి..



సాయికుమార్

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీకి చెందిన సాయి కుమార్ (28) క్యాబ్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయికుమార్ తిరిగి రాలేదు. భార్య ఫోన్ చేసి చూడగా స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. దీంతో తెలిసిన, వారు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త అదృశ్యంపై భార్య మానస ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌కు వెళ్తున్నానని..



శ్రీనివాస్

మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ (25) పటాన్‌చెరు మార్కెట్ యార్డులో హమాలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో జూలై 30వ తేదీన ఉదయం మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. భర్త కోసం లావణ్య తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మార్కెట్‌కు వెళ్లి ఆరా తీయగా వచ్చి వెళ్లిపోయాడని చెప్పారు. దీంతో భర్త అదృశ్యంపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డ్యూటీకి వెళ్తున్నానని..



శాంతకుమార్

డ్యూటీకి వెళ్తున్నానని వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈసంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రమేశ్ తన బావమరిది ఉప్పరి శాంతకుమార్ (23) కొంతకాలంగా ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల ఒకటో తేదీన డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. బావమరిది అదృశ్యంపై రమేశ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మతిస్థిమితం లేని మహిళ..



మీనా

దుబ్బాక: మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యమైన సంఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో బుధవారం జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. ధర్మాజీపేటకు చెందిన బత్తుల లింగంకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. తండ్రి లింగం చిన్న కూతురు మీనాతో కలిసి ఉంటున్నాడు. అయితే ఆరేళ్లుగా మీనా మానసిక పరిస్థితి సరిగా ఉండడం లేదు. మంగళవారం రాత్రి భోజనం చేసి పడుకుంది. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికినా మీనా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.